
క్రైస్తవ మాసపత్రిక
కృపావాక్యము
www.preacherstrainingschool.com
ఏప్రిల్
2019
SONY

Editor:
**Dr. K.G. Kumar,** Founder, President & Director, Preachers Training Schools

ఈ సంచికలో . . .

1. క్రీస్తు వద్దకు తెచ్చు దేవుని కృప - కె.జి. కుమార్
2. పరిసయ్యుల లక్షణములు - ఎమ్. రత్నకుమార్
3. ఓ జీవన నేస్తమా జాగ్రత్త ! - 75 - కె. సంధ్యారాణి
4. దానియేలు గ్రంథము - జి. సుదర్శనం
5. ప్రసంగ వ్యాసము - కె.జి. కుమార్

## OWNERSHIP INFORMATION:

| | | |
|---|---|---|
| Publisher | : | Dr. K.G. Kumar |
| Printer | : | Mr. G.Sathish Babu |
| Owner | : | Dr. K.G. Kumar |
| Printing Press | : | Satyakrishna Publishers<br>3-16c-60, Santhinagar,<br>Kakinada-533003 |
| Place of Publication | : | Turangi, Kakinada-533 016<br>D.No.7-113, Ravindranagar,<br>Turangi, Kakinada-533 016,<br>E.G.Dist., A.P., |
| Periodicity of Publication & Language | : | Monthly, Telugu |
| Nationality | : | Indian |

సింగిల్ కాపీ : 10/- సంవత్సరపు చందా : 100/- జీవితకాలపు చందా : 1000/-

మీచందాను ఈ దిగువ బ్యాంకు అకౌంట్కైనను పంపవచ్చును

**ది సౌత్ ఇండియన్ బ్యాంక్, కాకినాడ**

RTGS Code: SIBL0000126 , అకౌంట్ నెం. 0126053000018487

కృపావాక్యము మాసపత్రిక కావలసినవారు చందా పంపవలసిన చిరునామా

ఎడిటర్, కృపావాక్యము cell: 9849031095
రవీంద్రనగర్, తూరంగి
కాకినాడ-533016, తూ.గో.జిల్లా, ఆం.ప్ర., ఫోన్: 2342125
Email: kedarisetti_2000@yahoo.com
Website: www.preacherstrainingschool.com

# క్రీస్తువార్త

CHURCH OF CHRIST

Pleading for the Unity of Brotherhood

క్రీస్తుసంఘము. మత్త. 16:18, ఎఫె. 1:22,23, కొల. 1:18,24, రోమా 16:16

సంపుటి 22 ఏప్రిల్ 2019 సంచిక 5


## క్రీస్తు వద్దకు తెచ్చు దేవుని కృప

నన్ను పంపిన తండ్రి వానిని ఆకర్షించితేనే గాని యెవడును నా యొద్దకు రాలేడు; అంత్యదినమున నేను వానిని లేపుదును. వారందరును దేవునిచేత బోధింపబడుదురు అని ప్రవక్తల లేఖనములలో వ్రాయబడియున్నది గనుక తండ్రివలన విని నేర్చుకొనిన ప్రతివాడును నాయొద్దకు వచ్చును. ... మరియు ఆయన- తండ్రిచేత వానికి కృప అనుగ్రహింపబడకుంటే ఎవడును నాయొద్దకు రాలేడని యీ హేతువునుబట్టి మీతో చెప్పితినని (యోహా. 6:44,45,65).

ఈ మూడు వచనములు క్రీస్తు ప్రభువారి నోటనుండి వచ్చినవి. అయితే వీటిని గ్రహించుట కొంచెము కష్టము. ఎందుకనగా ఈ రోజులలో కోకొల్లలుగా ప్రజలు క్రైస్తవ విశ్వాసమును ఆకర్షించుచున్నారు. ఉద్యోగము కొరకు కొందరు ప్రభువు నమ్ముచున్నారు. పెళ్లి చేసుకొనుటకు బాప్తిస్మము తీసుకొను భార్య భర్తలు కొందరైతే కొందరు వ్యాధిని నయం చేసుకొనుటకు మొక్కుకొన్నవారు, వ్యాపార లాభము కొరకు కొందరు, తల్లిదండ్రులనుబట్టి కొందరు. ఎందుకనిన మా నాన్నగారు పాస్టరు అందుకు నా చిన్నతనము నుండి చర్చ్‌కు వెళ్ళుచున్నాము. పలు విధములుగా క్రైస్తవ విశ్వాసములోనికి వచ్చుచున్నారు. ఇది నిజమైన విశ్వాసమా, బైబిలులో దేవుడు కోరుకొను ప్రజలేనా వీరంతా? ప్రభువు ఇచ్చు సాక్ష్యమును చూడుము. "ఆయన వారికి త్వరగా న్యాయము తీర్చును; వారి విషయమే గదా ఆయన దీర్ఘశాంతము చూపుచున్నాడని మీతో చెప్పుచున్నాను. అయినను మనుష్యకుమారుడు వచ్చునప్పుడు

ఆయన భూమిమీద విశ్వాసము కనుగొనునా?" (లూకా 18:8).

లూకా 10వ అధ్యాయములో మరియ మార్తలను గూర్చిన వృత్తాంతమును మనము గ్రహించగలిగినా ఎంత ధన్యత. మరియ మార్తలు ఇద్దరు ప్రభువునందు విశ్వాసము గలవారేగాని, మార్త శరీర సంబంధమైన సన్నిహితమును, మరియ అయినచో ఆత్మసంబంధమైన సన్నిహితము కోరుకొనుచున్నారు. మరియ హృదయము, ఆత్మ ద్వారా క్రీస్తునందుగల లోతైన ఆత్మీయ జ్ఞానమును తాను ఆస్వాదించుచు ముందుకు వెళ్ళుచున్నది. మార్త లోకసంబంధముగా ఆలోచించుచున్నది. నేటి క్రైస్తవ లోకమునకు ఈ ఇద్దరు స్త్రీలుకు ఎంతో పోలిక వున్నదన్న సత్యము తెలియునా?

కొన్ని కోట్ల జనాభాను నేడు క్రైస్తవులుగా చూచుచున్నాము. ప్రపంచములో వీరి జీవన విధానములో ప్రభువుయొక్క మాదిరిగాని, పౌలుయొక్క మాదిరిగాని చూడగలుగుచున్నామా. ఇలాంటి సమయములో పౌలుగారు ఒక మాటను వ్రాయుచున్నారు. "మీరు విశ్వాసముగలవారై యున్నారో లేదో మిమ్మును మీరే శోధించుకొని చూచుకొనుడి; మిమ్మును మీరే పరీక్షించుకొనుడి; మీరు భ్రష్టులు కానియెడల యేసుక్రీస్తు మీలో నున్నాడని మిమ్మును గూర్చి మీరే యెరుగరా? మేము భ్రష్టులము కామని మీరు తెలిసికొందురని నిరీక్షించుచున్నాను. మీరు ఏ దుష్కార్యమైనను చేయకుండవలెనని దేవుని ప్రార్థించుచున్నాము; మేము యోగ్యులమైనట్టు కనబడవలెననికాదు గాని, మేము భ్రష్టులమైనట్టు కనబడినను మీరు మేలైనదే చేయవలెనని ప్రార్థించుచున్నాము" (2 కొరి. 13:5-7). భ్రష్టత్వము అనునది కనిపించని రోగము. ఎందుకనగా మనము ప్రార్థిస్తాము, చర్చ్‌కు వెళ్తాము, చందా ఇస్తాము, ప్రభువు బల్ల అను ఆజ్ఞను నెరవేర్చుతాము. కాబట్టి నాకు గాక ఎవరికి రక్షణయని మనము అనుకుంటాము అయితే విశ్వాసమును పరీక్షాకేంద్రము ద్వారా పరీక్షించినప్పుడు వానికి వచ్చిన మార్క్‌లనుబట్టి తెలియునని పౌలు ఉద్దేశ్యము.

నేతిబీరకాయలలో ఎంత నేయి వుండునో నేటి క్రైస్తవులలో భక్తి అంతగా వుండును. ఎందుకనినా దేవుని వాక్యము చెప్పు విషయమును మనము గ్రహించినచో "అంత్య దినములలో అపాయకరమైన కాలములు వచ్చునని తెలిసికొనుము. ఏలాగనగా మనుష్యులు స్వార్థప్రియులు ధనాపేక్షులు బింకములాడువారు అహంకారులు దూష కులు తల్లిదండ్రులకు అవిధేయులు కృతజ్ఞతలేనివారు అపవిత్రులు అనురాగ

రహితులు అతిద్వేషులు అపవాదకులు అజితేంద్రియులు క్రూరులు సజ్జనద్వేషులు ద్రోహులు మూర్ఖులు గర్వాంధులు దేవునికంటె సుఖానుభవము నెక్కువగా ప్రేమించువారు, పైకి భక్తిగలవారివలె ఉండియు దాని శక్తిని ఆశ్రయించనివారునై యుందురు. ఇట్టివారికి విముఖుడవై యుండుము'' (2 తిమో. 3:1-5).

వేరొక చోట పౌలు క్రేతీయులను ఉద్దేశించి ఇలా అన్నారు. "దేవుని ఎరుగుదుమని వారు చెప్పుకొందురు గాని, అసహ్యులును అవిధేయులును ప్రతి సత్కార్యము విషయము భ్రష్టులునై యుండి, తమ క్రియలవలన ఆయనను ఎరుగమన్నట్టున్నారు" (తీతు 1:16). క్రైస్తవ విశ్వాసము ఇంత చౌకబారుతనమును సంతరించుకొనుటకు కారణములు ఎవరునూ ఆలోచించుటలేదు. ఎందుకనగా "నమ్మదగిన బోధను ఎవరు బోధించుట లేదు'' (తీతు 1:9, 2:1,8). విశ్వాసనీయమైన బోధను బోధించుటకు వారు దేవునికన్నా సుఖానుభవము నెక్కువగా ప్రేమించుచున్నారు. గాన ఇటు బోధకులు అటు విశ్వాసులో వేషధారణతో కూడిన మాటలు, వేషములు, తాముకు తామే అవమానపర్చుకొను వస్త్రములు, వెకిలిమాటలు, చేష్టల ద్వారా తమలో దాగి వున్న కామవికారత్వము బయలుపర్చుకొనుటవలన వారు భక్తిహీనులైనారు. కేవలము నటనతో కూడిన క్రైస్తవ్యమును మనము పోషించుచున్నాము.

కాబట్టి ఇట్టి భక్తిగలవారిని దేవుడు కోరుకొను జనులు ఎన్నటికి కాదు (యోహా. 6:44). ఈ ఒక్క మాటను చూడుడి. నన్ను పంపిన తండ్రి వానిని ఆకర్షించితేనే గాని యెవడును నా యొద్దకు రాలేడు. అంత్యదినమున నేను వానిని లేపుదును. ప్రశ్న ఏమనగా నేటి క్రైస్తవులందరు తండ్రిచే ఆకర్షించించబడినవారేనా, వారు నిత్యజీవముకొరకు లేపబడుటకు, ఇంకొక విషయము ఏమనగా "తండ్రివలన విని నేర్చుకొనిన ప్రతీవాడును నా యొద్దకు వచ్చును" (6:45) ఎవరు క్రీస్తు వద్దకు వత్తురు? వీరంతా తండ్రివలన విని బోధించబడిన వారేనా? ఎంతమంది క్రైస్తవులు నిష్టతో బైబిలును ప్రతీ దినము చదివి ధ్యానింతురు. ధ్యానించి దాని సారాంశమును గ్రహించి జీవించుచున్నారు.

మూడవ మాటను చూడుడి "తండ్రిచేత వానికి కృప అనుగ్రహింపబడకుంటే ఎవడును నా యొద్దకు రాలేడు'' (యోహా. 6:65). అయితే ఇప్పుడు ప్రభుయొద్దకు వచ్చామని అనుకున్నవారు, చెప్పుకొనువారు అంతా తండ్రి కృపతో క్రీస్తును

తెలుసుకొని యున్నారా?

యోహా. 6:44,45,65 వచనములతో వున్న మూడు ఆలోచనలని పిలవండి, లేక తలంపులు లేక భావములనుబట్టి నాకు కలిగిన అనుభవము ఏమనగా?

లోకములో వున్న మానవులు ఏ మతస్థులైనా, వారు ఏదేవుడినైనా శ్రద్ధాసక్తులతో, భయముతో, నీతితో సేవించుచుందురో వారిని దేవుడు ఆకర్షించి తనవైపు తన మార్గమునకు త్రిప్పుకొనును. వాళ్ళ రాళ్ళనే సేవించనీయుడి, చెట్లను, పాములను మరి ఏదైనాకాని, వారి ఆరాధనలో యధార్థత వున్నయెడల వారిని తనవైపుకు ఆకర్షించును. ఎందుకనగా లోకముగాని సర్వలోకములలోగాని యెహోవా తప్ప మరి ఏ దేవుడు లేడుగాన సర్వమానవాళి చేయు ఎట్టి పూజ గాని, ఆరాధన గాని అది యెహోవాకే చెందును గాని మరి ఎవ్వరికి చెందదు. అయితే ఆరాధికుడు యెహోవా నామములో చేయుటలేదు గాన పూజాఫలము పొందలేడు. అయితే వీరందరిలో ఎవరు అత్యంత భక్తి శ్రద్ధలతో యధార్థముగా సేవించుచున్నారో వారిని తండ్రి ఆకర్షించును గాన వారు ప్రభువైపు త్రిప్పబడి నిజదేవుని సేవించి మహిమపర్చబడుదురు.

అపొస్తలుడైన పౌలు సౌలుగా వున్నప్పుడు అత్యంత భక్తి శ్రద్ధలు కలిగినవాడు గాన ప్రభువైపుకు త్రిప్పబడెను. తిరిగి తండ్రిని క్రీస్తును కలిగి సేవించు భాగ్యము దొరికెను, అన్యురాలైన రూతు, కొర్నేలీ, తామారు వీరంతా వారి వారి విశ్వాసములో నిష్ఠగలిగినవారైనందున వారు నిజదేవుని సేవించిరి తరించిరి. నీవు నేను తండ్రివలన కృప పొంది ప్రభువును సేవించి నిత్యజీవమును పొందుదుము.

***


**3వ యౌవ్వనస్థుల సహవాస కూడిక**

**తేదీలు : 2019 మే 2, 3**

**అంశము : సంఘము - యౌవ్వనులు**

*ఈ కూడికలు కేవలము స్త్రీ, పురుషులు 15-30 సం॥ల వారికి మాత్రమే*

9849031095

# పరిసయ్యుల లక్షణములు - M.రత్నకుమార్, P.T.స్కూల్ 9000312310

యేసుప్రభువువారు ఈ భూమిమీద చేసిన అనేక బోధలలో పరిసయ్యులను ఎక్కువగా హెచ్చరించి గద్దించిన అనేక సందర్భములు పరిశుద్ధ గ్రంథములో మనము కనుగొనగలము. వారి ప్రవర్తననుబట్టి ఎక్కువగా ఖండించెను. వారిని ఏయే విషయములలో గద్దించెనో అట్టివాటి విషయములో మనము కూడా జాగ్రత్త కలిగియుందుము.

## (1) పరిసయ్యులు విధేయత లేని జ్ఞానమును కలిగియున్నారు

అప్పుడు యేసు జనసమూహములతోను తన శిష్యులతోను ఇట్లనెను శాస్త్రులును పరిసయ్యులును మోషే పీఠమందు కూర్చుండువారు గనుక- వారు మీతో చెప్పువాటినన్నిటిని అనుసరించి గైకొనుడి, అయినను వారి క్రియల చొప్పున చేయకుడి (మత్త.23:2,3).

పరిసయ్యులయొక్క ఎక్కువ లక్షణాలను యేసుప్రభువు బైబిలులోని మరి ఏ ఇతర అధ్యాయముల కంటే మత్తయి 23లో బహిరంగంగా తెలియజేసెను. పరిసయ్యులు మోషే పీఠమందు కూర్చుండువారు, వారు ఖచ్చితమైన ధర్మశాస్త్ర జ్ఞానమును కలిగియున్నారు. పరిసయ్యులు చెప్పువాటినన్నిటినీ అనుసరించి గైకొనుమని యేసుప్రభువే తన శిష్యులకు చెప్పెను. కనుక పరిసయ్యులు చెప్పేవన్నీ సరిగానే ఉండి ఉండాలి. అయితే వారు ఏదైతే సత్యమని ఎరుగుదురో దానికి విధేయత చూపించరు. జ్ఞానం అనేది ఎంతో ఉపయోగకరమైన విషయం. కాని విధేయతతో కూడిన జ్ఞానము మాత్రమే ఆత్మీయ జీవమును తెస్తుంది. విధేయత లేని జ్ఞానము ఆత్మీయ మరణమునకు దారి తీస్తుంది. జ్ఞానమును మనము తీసుకునే ఆహారముగాను, విధేయతను జీర్ణక్రియగాను పోల్చవచ్చును. మనము ఎంత ఆహారం తీసుకున్నా అది జీర్ణం కాకపోతే శరీరానికి శక్తినివ్వదు. మనము జ్ఞానమును సమకూర్చుకుంటూ దానికి విధేయత చూపించకుంటే ఆత్మీయంగా శక్తివంతంగా ఉండలేము. గరిష్ఠముగా జ్ఞానము కలిగి కనిష్ఠముగా ఎవరైతే విధేయత చూపిస్తారో వారు పరిసయ్యులకు సాదృశ్యంగా ఉన్నారు. జ్ఞానమునకు తగిన విధేయత మన ఆత్మీయ ఎదుగుదలకు మూలము.

## (2) పరిసయ్యులు సూచక క్రియలను అడుగుటచేత ప్రభువుని శోధించారు

పరిసయ్యులు యేసుప్రభువుతో “బోధకుడా, నీవలన ఒక సూచక క్రియ

చూడగోరుచున్నామని" ఆయనతో చెప్పిరి (మత్త. 12:38). దీనిని యేసుప్రభువు దృఢముగా ఖండించెను. సత్యమును నిశ్చయపరచుకొనుటకు పరిసయ్యులు ఎప్పుడూ ఏదో ఒక సూచకక్రియను లేక అద్భుతమును కోరుదురు. వారు సాధారణమైన విశ్వాసముతో జీవించలేరు. అందుచేతనే ఈ రోజు అనేకమంది మతపరమైన జ్ఞానం ఉన్నట్టు నటించేటటువంటి పరిసయ్యులను వారియొక్క తప్పుడు సూచకక్రియలతోను మరియు అద్భుతాలతోను మోసపుచ్చగల్గుతున్నారు. దేవున్ని ఒక సూచకక్రియనో లేక ఒక అద్భుతమునో చేయమని అడుగుట అనేది ఆత్మీయతకు ఒక గుర్తు అని ఎప్పుడూ అనుకొనవద్దు. ఇది పరిసయ్యుల లక్షణము. అనేకమంది వాక్యానికి తగిన విశ్వాసమును కలిగియుండుటకు బదులుగా సూచక క్రియలవైపే మొగ్గుచూపుతున్నారు. చూచి నమ్మినవారికంటే చూడక నమ్మినవారు ధన్యులని వాక్యము చెప్పుచున్నది గదా!

### (3) పరిసయ్యులు దైవజనులతో వారికున్న సంబంధాన్ని బట్టి అతిశయించుదురు

"అబ్రాహాము మాకు తండ్రి అని మీలో మీరు చెప్పుకొన తలంచవద్దు" (మత్త. 3:8). ఒక పరిసయ్యుడికి తాను దైవభక్తి గలవాడు కాదు అని తెలుసు, కనుక దైవజనుడని మంచి పేరు పొందిన వారితో సంబంధము కలుపుకొనుటకు ప్రయత్నించును. తద్వారా అతడు కూడా దైవభక్తి గలిగినవాడనని చెప్పుకొనును. ఈనాడు ఎంతోమంది శరీరానుసారులైన క్రైస్తవులు ఒక దైవజనుడు నడిపించే సంఘములోని సభ్యులమని అతిశయపడుదురు. వారికి ఏ మాత్రము పరిశుద్ధత లేనప్పటికినీ, దైవజనునికి కలిగిన పేరు ప్రతిష్టలనుబట్టి జీవించుదురు. పరిసయ్యులు మేము అబ్రాహాము సంతానమేనని అనుకొనిరి గానీ అబ్రాహామువంటి విశ్వాసము వారియొద్ద లేదు. ఒకవేళ మన జీవితములో మారుమనస్సు పొందని పాపము ఏమైన ఉండి ఉంటే, మనము చాలా మంచి సంఘములో ఉండి కూడా నరకమునకు పోయే ప్రమాదము కలదు. కనుక ఇతరుల భక్తి జీవితమును బట్టి అతిశయింపక మనలను మనమే విమర్శించుకొని దిద్దుకొనుట అత్యవసరము.

### (4) పరిసయ్యులు వేషధారులు

"పరిసయ్యుల వేషధారణ అను పులిసిన పిండిని గూర్చి జాగ్రత్తపడుడి" (లూకా 12:1). వేషధారులైన పరిసయ్యులారా అని యేసుప్రభువు వారిని బహిరంగముగా

ఖండించెను. ఆనాటి గ్రీకు దేశమునకు వెళ్ళి, వేషధారులు ఎక్కడ ఉందురని అడిగినట్లయితే వారు "నాట్యశాలలో" ఉందురు అని జవాబిచ్చుదురు. ఆ వేషధారులు నాటకశాలమీదకి వచ్చి కొద్ది గంటలు వారు నటించిన తరువాత ఇంటికి వెళ్ళి వారి మామూలు జీవితమును జీవించుదురు. నేడు ఎక్కువ వేషధారులను సంఘములో కనుగొంటాము. ఆదివారం ఉదయమున కొద్ది గంటలు వారి భాగమును నటిస్తారు. ప్రతి ఆదివారం ఆ సమయమున ప్రభువును గొప్పగా స్తుతిస్తునట్లు నటించుదురు. మిగతా రోజుల్లో వారి జీవితం యధాస్థానమునకు వెళ్ళిపోవును. దేవుడు ప్రతి దినము యధార్థమైన జీవితంతో కూడిన ఆరాధనను మాత్రమే స్వీకరించును. మనము ఏ విధంగా ఉన్నాము? సంఘ కూడికలలో ఇతరులు చూచునట్లు నటిస్తున్నామా? అయితే అది పరిసయ్యుల లక్షణమే అవుతుంది. జాగ్రత్తపడవలెను.

### (5) పరిసయ్యులు కేవలము బయటికి మంచి సాక్ష్యము కలిగియుండే దానిమీదే శ్రద్ధ చూపుదురు.

> అయ్యో వేషధారులైన శాస్త్రులారా, పరిసయ్యులారా మీరు గిన్నెయు పళ్లెమును వెలుపట శుద్ధి చేయుదురు గాని అవి లోపల దోపుతోను అజితేంద్రియత్వముతోను నిండియున్నవి .... అలాగే మీరు వెలుపల మనుష్యులకు నీతిమంతులుగా నగపడు చున్నారు గాని లోపల వేషధారణతోను అక్రమముతోను నిండియున్నారు (మత్త. 23:25-28).

పరిసయ్యులు వారి జీవితములో బాహ్యముగా కనబడే వాటినే శుద్ధి చేసుకొనెదరు. కాని వారి హృదయములు ఏ స్థితిలో ఉన్నవో పట్టించుకొనరు. బయటకు చూచుటకు వారు ఎంతో ఆసక్తి కలిగియున్నట్లుగా ప్రజలముందు మంచి పేరు తెచ్చుకొనుటకు ప్రయత్నించుదురు గాని దేవునివలన ఆమోదం పొందటానికి చూడరు. మనము దేవుని ఆమోదం పొందటానికి చూస్తున్నామా లేక మనుష్యుల ఆమోదం పొందటానికి చూస్తున్నామా? అని మనలను దేవుడు పరీక్షిస్తాడు. ఒక వ్యక్తి తన హృదయములో పవిత్రత విషయములో నిర్లక్ష్యముగా ఉంటాడు కాని మనుష్యుల యెదుట మంచి సాక్ష్యము కలిగి ఉండాలని ఆసక్తి కలిగి ఉంటాడు. ఇది దేవుని భయము ఆ వ్యక్తిలో లేదని ఋజువు చేయుచున్నది. "మనుష్యులు పై రూపమును లక్ష్యపెట్టుదురు గాని దేవుడు మన హృదయములను లక్ష్యపెట్టును" (1 సమూ. 16:7). ఒక క్రైస్తవుని ప్రాధమిక లక్షణం ఏమిటంటే అతడు తన హృదయమును దేవుని ఎదుట ఎల్లప్పుడూ

పరిశుద్ధంగా, పవిత్రముగా ఉంచుకొనుటకు చూస్తాడు.

మనము పరిసయ్యుల కొన్ని లక్షణములు గమనించాము. యేసుప్రభువువారు చెప్పిన ఒక మాట మనము ఎల్లప్పుడూ జ్ఞాపకముంచుకొనవలెను. "శాస్త్రుల నీతికంటెను, పరిసయ్యుల నీతికంటెను మీ నీతి అధికము కానియెడల మీరు పరలోక రాజ్యములో ప్రవేశింపనేరరని మీతో చెప్పుచున్నాను" (మత్త. 5:20).

## ఓ జీవన నేస్తమా జాగ్రత్త!–75

కె. సంధ్యారాణి, B.A.
పి.టి.స్కూల్

ప్రభువునందు ప్రియ సోదరీ, సోదరులకు నా వందనములు.

గత కొన్ని నెలలుగా మనం అపొస్తలుల యొక్క బోధనుగూర్చి చర్చించుకున్నాము. అయితే ఈ నెల 2వదిగా సహవాసమును గూర్చి చర్చించుకుందాము. ఏమిటి అపొస్తలుల సహవాసము, మనము ఎవరితో సహవాసము చేయాలనేది కొన్ని విషయములను క్లుప్తంగా నేర్చుకుందాము.

సహోదరులారా, ప్రతి మనుష్యుడును ఏ స్థితిలో పిలువబడునో ఆ స్థితిలోనే దేవునితో సహవాసము కలిగి ఉండవలెను (1 కొరి. 7:24).

ఇచ్చట అపొస్తలుడైన పౌలుగారు చాలా చక్కటి విషయమును క్రైస్తవులకు జ్ఞాపకం చేయుచున్నాడు. ప్రతి మనుష్యుడును ఏ స్థితిలో పిలువబడునో అనగా యూదుడని, అన్యజనుడని లేక ఉన్నవాడని, పేదవాడని ఏ బేధం లేదు. ఎవరిమట్టుకు వారికి పూర్వమందు వున్న స్థితిని బట్టే దేవుని యొద్దకు వచ్చినప్పటికిని ఆ స్థితిలోనే దేవునితో సహవాసము చేయాలి.

అనగా మనం మొదటిగా తండ్రియైన దేవునితో సహవాసము చేయుటకు ఆదివారము ఆరాధనకు వెళ్ళుచున్నామన్న సంగతిని ఏ క్రైస్తవులు మరువరాదు. ఇక దేవునితో సహవాసము చేయుటకు వస్తున్న మనమందరము దేనిని బట్టియు అతిశయించకూడదు. కారణం దేవుని దృష్టిలో అందరము సమానమే.

"అతిశయించువాడు ప్రభువునందే అతిశయింపవలెను. ప్రభువు మెచ్చుకొనువాడే

యోగ్యుడు గాని తన్ను తానే మెచ్చుకొనువాడు యోగ్యుడు కాడు" (2 కొరి. 10:18). ఈ విషయమును కూడా పౌలుగారే వ్రాయుట జరిగింది. అనగా దేవుని యొద్దకు వచ్చువాడు తనకున్న లోకసంబంధమైన గొప్పస్థితిని బట్టి గర్వించకుండా తగ్గింపు స్వభావమును కలిగి దేవునితో సహవాసము చేయాలి.

మనము ప్రతి ఆదివారము మానక దేవునితో సహవాసము చేస్తున్నాము అని మురిసిపోతున్నాము. కానీ దేవుడు మనతో సహవాసము చేయుటకు ఇష్టపడుచున్నాడా? అని ఏ ఒక్కరము ఆలోచించము. అసలు దేవునితో సహవాసము చేయుటకు మనకు ఉన్న అర్హతలేమిటి? ఇది ఆలోచించవలసిన విషయము.

ఎందుకనగా నీవుగానీ, నేను గాని ఏ ఉద్యోగమునకైనా ఇంటర్వ్యూకి వెళ్లినప్పుడు వారు మన పేరుతో పాటు మనకు ఉన్న విద్యార్హతలేమిటని ప్రశ్నించుదురు, అంతే కాక వారు మనకిచ్చిన 10, 15 నిమిషముల సమయములోనే మన ప్రవర్తన పట్ల ఒక అంచనాకి వచ్చి ఉద్యోగం ఇవ్వాలా, లేక వద్దా అని ఆలోచన చేస్తారు.

కేవలం భూసంబంధమైన బ్రతుకుదెరువు కోసమే ఇన్ని అర్హతలు సంపాదించవలసి వస్తే దేవునితో సహవాసము చేయుటకు, మరి పరలోకానికి మనం వెళ్లుటకు ఎన్ని అర్హతలను సంపాదించవలెనో ఆలోచన చేయండి?

దేవునితో సహవాసము చేయుటకు ఆదివారము ఆరాధనకు వెళ్లుచున్న మనము ముందుగా చూసుకోవాల్సింది మంచి చీర, నగలు, కాదు మన ప్రవర్తన. ఎటువంటి ప్రవర్తనతో మనం ఆయనతో సహవాసము చేయుటకు వెళ్లుచున్నాము అని మనలను మనమే పరిశీలన చేసుకోవాలి.

లోకరీత్యా మనం గమనించినట్లయితే పేదవానితో ఎవరూ సహవాసము చేయరు. కారణం వీడిదగ్గర ఏముంది మేము సహవాసము చేస్తే ఖర్చంతా మేమే పెట్టాలి అని ఇలాగున మనుష్యులు ఆలోచిస్తుంటారు. మరి మనతో దేవుడు ఎలాగున సహవాసము చేస్తాడు అనగా మనవలే ఆయన మనకున్న డబ్బునుబట్టి, రూపమునుబట్టికాక మన మంచి ప్రవర్తన, భక్తి గలిగిన జీవితమును బట్టియే ఆయన మనతో సహవాసం చేస్తాడు.

మాతోకూడ మీకును సహవాసము కలుగునట్లు మేము చూచినదానిని వినినదానిని

> మీకును తెలియజేయుచున్నాము. మన సహవాసమైతే తండ్రితో కూడను ఆయన కుమారుడైన యేసుక్రీస్తుతో కూడను ఉన్నది (1 యోహా. 1:3).

మన సహవాసము తండ్రితో కూడను అదే విధముగా క్రీస్తుతో కూడను వున్నది. మరి వారితో సహవాసము చేయుటకు మనము వారివలే పరిశుద్ధులుగాను, వెలుగు సంబంధులవలె యుండవలెను.

> అయితే ఆయన వెలుగులోనున్న ప్రకారము మనమును వెలుగులో నడిచినయెడల, మనము అన్యోన్యసహవాసము గలవారమై యుందుము; అప్పుడు ఆయన కుమారుడైన యేసు రక్తము ప్రతి పాపమునుండి మనలను పవిత్రులనుగా చేయును. మనము పాపములేనివారమని చెప్పుకొనినయెడల, మనలను మనమే మోసపుచ్చుకొందుము; మరియు మనలో సత్యముండదు (1 యోహా. 1:7,8).

ఇచ్చట యోహానుగారు చాలా స్పష్టముగా చెప్పుచున్న విషయమును గమనించినట్లయితే దేవుడు వెలుగు సంబంధి కనుక మనము కూడా వెలుగు సంబంధులవలె నడుచుకొన్నప్పుడు అనగా దుష్టత్వము, అహం, అసూయ, కక్ష్య, ఇలాగున మనకున్నటువంటి చీకటి అవలక్షణములన్నిటిని తీసివేసినప్పుడు మాత్రమే మనము కూడా వెలుగుసంబంధులమవుతాము. అప్పుడే తండ్రియైన దేవునితో అన్యోన్య సహవాసము అనగా ఇచ్చట ఎంత చక్కటి పదజాలము వాడారో చూడుడి.

లోకసంబంధముగా చూసినట్లయితే ఈ పదమును సాధారణముగా భార్య భర్తలకు ఉపయోగిస్తారు. వీరు చాలా అన్యోన్యముగా వుంటారండి అని అంటారు. అనగా వారిని ఎవ్వరూ విడదీయలేరు, వారిమద్య ఎటువంటి మనస్పర్ధలు లేవు, ఒకరిపట్ల ఒకరు ప్రేమ కలిగి వుంటారు అని దీని అర్ధము.

మరి మనము కూడా దేవునివలే వెలుగుసంబంధులమైనప్పుడు ఆయనతో మనము అన్యోన్యసహవాసమును చేయుదము, అంతమాత్రమే కాక ఆయన కుమా రుని రక్తం ద్వారా మనలను పవిత్రులనుగా చేస్తాడు అనే విషయమును మరువరాదు.

ప్రియసోదరీ ఈ ఆర్టికల్‌ను చదువుచున్న నీవు దీనినుంచి ఏమి గ్రహించుకుంటున్నావు, ఏమి నేర్చుకుంటున్నావు అని ఆలోచన చేయాలి. అప్పుడే మనము ఈ భూమిమీదను, పరలోకమందును తండ్రి, కుమార, పరిశుద్ధాత్మలతో సహవాసము చేయుదము.

# దానియేలు గ్రంథము

## నాలుగు రాజుల కాలములో దానియేలు యొక్క పని

దానియేలు పుస్తకము రమారమి డెబ్బది రెండు సంవత్సరములలో జరిగిన సంభవాల యొక్క చరిత్రను వివరిస్తుంది.

| | |
|---|---|
| 1. క్రీ.పూ. 605లో నెబుకద్నెజరు | కల్దీయుడు. దాని. 1:4 |
| 2. క్రీ.పూ. 586లో నెబుకద్నెజరు కుమారుడు | బెల్షస్సరు - కల్దీయుడు దాని. 5:18, 22-23, 30 |
| 3. క్రీ.పూ. 586లో అహష్వేరోషు కుమారుడు | దర్యావేషు - మాదీయుడు దాని. 9:1, cf ఎస్తేరు 1:1 |
| 4. క్రీ.పూ. 539 కోరేషు-పారశీకుడు | దాని. 10:1, 1:21, 6:28 |

క్రీ.పూ. 606లో నెబుకద్నెజరు యెరూషలేముమీదికి దండయాత్రకు పోతాడు. దండయాత్ర అంటే ఒక దేశము మీదికి యుద్ధానికి పోవుట అని అర్థం. ఈ దండయాత్రలో దానియేలు గ్రంథము ప్రారంభించబడుతుంది. ఈలాగున క్రీ.శ. 606లో ప్రారంభమై క్రీ.శ. 536తో బబులోను చెఱ అంతమవుతుంది. అనగా 606-536=70 సంవత్సరములు పూర్తి అవుతుంది. బబులోను చెఱ మూడు అంచెలుగా జరిగింది.

1. క్రీ.పూ. 606లో నెబుకద్నెజరు రాజవంశీయులను యూదా దేశపు యెరూషలేము దేవాలయపు బంగారు సామగ్రి దోచుకొని పోబడింది (దాని. 1:1-2, 2 రాజు. 24:1, 2 దిన. 36:5-7.

2. క్రీ.పూ. 597లో రెండవసారి నెబుకద్నెజరు యెరూషలేమును ముట్టడి వేసి, రెండవ తరగతి జనులను మరియు దేవుని మందిరములోని బంగారపు ఉపకరణములను కొనిపోయెను. అందులో యెహెజ్కేలు రెండవసారి చెఱలోనికి పోయెను (2 రాజు. 24:14-18).

3. క్రీ.పూ. 586లో మూడవ దండయాత్రతో యెరూషలేము నాశనము చేయబడి, యెరూషలేము పాడుగాను, యూదా దేశము బీడుగా విడువబడింది. ఆ బీడుగా

విడువబడిన దేశములో యిర్మీయా ప్రవక్త కాపురమున్నాడు. యూదా రాజైన సిద్కియా కన్నులూడదీసి బబులోను కొనిపోయెను (2 రాజు. 25:1-7). పాడుగాను బీడుగాను విడువబడిన యూదా దేశమందు యిర్మీయా కాపురము చేయుచు ప్రవక్తగా యుండెను. యెహెజ్కేలు చెఱ నివాసులమధ్య ప్రవక్తగా పనిచేయుచుండెను. దానియేలు బబులోను రాజా స్థానములో కల భావాలను, దర్శనాలు దాని అర్థాలను చెప్పుచు ప్రవక్తగా పనిచేయుచుండెను. యిర్మీయా ప్రవక్తయొక్క గ్రంధాన్ని దానియేలు చదువుచుండెను (దాని. 9:1-2). దానియేలుకు ఈ (Information) వర్తమానము యిర్మీయా గ్రంధము నుండి వచ్చినది (యిర్మీ. 25:12-14). యిర్మీయా ప్రవచనములు చెఱనివాసులకు చెప్పబడే సారాంశము యెహెజ్కేలు గ్రంధమై యున్నది. అందువలన యిర్మీయా గ్రంధము ప్రధానపాత్రగా వివరించబడుతుంది.

కల్దీయులు మంత్రతంత్రాలు చదివేవారు మత విషయములలో నిష్ఠ కలవారు. యూదులకు పత్యపు భోజనాలుంటాయి. వీరును యూదా మత నిష్టయందు పట్టుదల గలవారు. విగ్రహముల దగ్గర నుండి వచ్చిన అపవిత్ర భోజనాలు చేయరు. ఈలాంటి పరిస్థితులలో దానియేలు బబులోనులో ప్రధాన ఆస్థాన పండితుడుగా యుండెను (దాని. 6:1-3). బబులోను చెఱ యూదులను శుద్ధీకరించే కర్మాగారముగా దేవుడేర్పాటు చేసెను.

దానియేలు పుస్తకము యొక్క పూర్వచరిత్ర (యిర్మీ. 27:4-11). దేవుడు బబులోను రాజ్యాన్ని నెబుకద్నెజరునకు అప్పగించి యూదా జనులను బబులోను రాజు వశములో యుంచెను. దాని. 1+2 అధ్యాయాలు. యిర్మీ. 27:4-11 యొక్క దానియేలు రెండవ అధ్యాయము యొక్క సందేశము మానవ రాజ్యాలు అస్థిరమైనవి అని తెలిపే వర్తమానము ప్రతిమ (విగ్రహము) యొక్క విశేషము.

దానియేలు విశ్వాసము యొక్క ప్రత్యేకత కల భావము చెప్పే విశేషమైన సంగతి. దేవుడు కాలములను సమయములను మార్చువాడని దానియేలుకు తెలుసు (దాని. 2:20-22). కాలాలు సమయాలు దేవుని వశములో యున్నవని ప్రభువైన క్రీస్తునకు తెలుసు (అపొ.కా. 1:7).

(సశేషం)

## సంఘము కలసివుంటే నిలచి వుంటారు (ఫిలి. 2:1-4)

**ఉపోద్ఘాతము:-**

1) నాలుగు అడవి ఎద్దులు కలసి సింహమును ఎదిరించి జయించుట

2) గడ్డిపరకగా నుంటే అది ఏమి చేయలేదు గాని కొన్ని గడ్డి పరకలను పెనవేసి తాడుగా పేనినచో అది బలమైన ఏనుగును బంధించు విధము.

3) నిమ్రోను తన ప్రజలు కలసియున్నంత కాలము అనగా ఒకే భాషలో నున్నంత కాలము బాబేలు కట్టబడినది. వారు విడిపోగా అది కూలెను లేక ఆగెను.

4) ఇశ్రాయేలీయులు ఒక రాజ్యముగా నున్నంత కాలము బలమైన రాజ్యముగా నున్నారు, విడిపోయి బలహీనులైనారు.

5) విభజించినచో పడిపోవుట సులభం. కలసి వుంటే జయించగలము.

6) బ్రిటిష్‌వారు మన దేశములో ఉపయోగించిన రాజకీయ చతురత ఇదే.

7) ఒక ఇల్లు తనకు తానే వేరుపడిన యెడల ఆ ఇల్లు నిలువనేరదు.మార్కు 3:24

8) అందుకే ప్రభువారు తనయందు విశ్వాసముంచువారంత ఏకమై యుండాలని ప్రార్థించిరి. యోహా. 17:20-23

9) పౌలుగారు సంఘములకు లేఖలు వ్రాయుచూ "ఆత్మ కలిగించు ఐక్యతను కాపాడుటయందు శ్రద్ధ కలిగినవారై యుండాలని హెచ్చరించెను" ఎఫె.4:1-3.

10) దీనికంతటికి మూలము ఏమనగా "వాక్యానుసారముగా ప్రవర్తించుడి లేక జీవించుడి" ఫిలి. 1:27.

11) సంఘము ఏకాత్మతోను, ఏకమనస్సుతోను, ఒక్క భావముతోను, ఒకే మాటతోను కలిగియుండాలి. లేనిచో ఆ సంఘము యొక్క మనుగడ ముందుకు సాగదు.

**చర్చనీయాంశము:-**

I. మొట్టమొదటిగా క్రైస్తవులు ఆత్మలో ఏకమై యుండుట. ఫిలి. 2:1-2

ఎ) పౌలు హెచ్చరిక ఏమనగా అస్థిరులతో స్నేహముగా నుండవద్దన్న హెచ్చరికను గమనించుడి. ఫిలి. 1:27-30

బి) జారులతో సహవాసము చేయరాదు. 1 కొరి. 5:9-11

సి) బలమైన వ్యక్తి సంఘములోని బలహీనులను బలపర్చును.

1) క్రీస్తులో మీరు జీవించుచున్న జీవితము మీకు శక్తినిచ్చినదా అనగా అవును అని నీ సమాధానము కావలెను.

2) ఆత్మయందు సహవాసము. ఎఫె. 4:1

3) క్రీస్తునందు వున్నవారు క్రీస్తు ఆత్మను గలిగి సహవాసము చేయుట అవసరము.

డి) విశ్వాస విషయమై ఐక్యత గలవారిగా నుండి, అభిప్రాయ విషయములో స్వేచ్ఛాపరులముగా నుండాలి.

ఇ) ఎక్కువమంది సహోదరులు "ఐక్యతకు" బదులుగా తమ దృష్టికి మేలైనది చేయుట అన్నది కలిగిరి. న్యాయా. 21:25

II. ఏకమై వుండుట ఎప్పుడు సాధ్యము అనగా "నిస్వార్ధతలోనే" ఫిలి. 2:3,4

ఎ) వేరు వేరు వ్యక్తులు వ్యక్తిత్వము గలవారు ఏలాగు ఏకమై యుండగలరు?.

1) క్రీస్తుతో ఏమై యున్నప్పుడు. రోమా 6:5

2) దేవుని ఆత్మచేత క్రీస్తు స్వరూపములోనికి తేబడినవారు ఏకమై యుందురు. గల. 4:19, 1 కొరి. 1:10-13

3) స్వార్ధమైన మనస్సుతో ఏకమై యుండరాదు. ఫిలి. 1:17

4) స్వప్రయోజనము కక్షలకు, అసూయలకు కారణమగును.

బి) స్వప్రయోజనములో గర్వము వుండును

సి) గర్వము వలన దేవుని పనికి బదులు తమను తాము వృద్ధి చేసుకొందురు.

డి) గర్వము లేక స్వార్ధమును విడుచుట ఎట్లు?

1) వినయమైన మనస్సు. ఫిలి. 3:3

2) వినయమైన మనస్సు సాత్వికము వలన కలుగును. సంఖ్యా. 12:3

3) ప్రభువు ఎలాంటివారు ఆయన దేవుడై యుండి కూడా నేను సాత్వికుడను, దీనమనస్సు గలవాడను, నన్ను గూర్చి నేర్చుకొనండి. మత్త. 11:29, ఫిలి. 2:8

4) అయితే ఆయన వ్యక్తిత్వమును గూర్చి తండ్రియైన దేవుడు మాట్లాడి నప్పుడు. యోహా. 17:23

5) అయితే బోధకు తన్ను గూర్చి తన్ను తగ్గించుకొను స్వభావమువలన తాను మహిమపర్చబడును. యోహా. 2:11

ఇ) వినయము అనగా నేమి?

1) మాటలోను, ప్రవర్తనలోను మాదిరిగా నుండుట. 1 తిమో. 4:12

2) ఇతరులను గూర్చి  హెచ్చుగా ఆలోచించుట. 1 పేతు. 5:5,6.

3) తన సొంత కార్యములకన్నా ప్రభు కార్యములు ఫిలి. 2:21.

<u>ముగింపు</u>:-

1) ఈ ప్రసంగ వ్యాసములో రెండు సత్యములను తెలుసుకొన్నాము.

ఎ) ఐక్యత యొక్క అవసరత.

బి) ఈ ఐక్యతను సాధించుటలో ప్రధానమైన విషయం నిస్వార్ధం.

సి) ఐక్యత సంఘములోను, నీలోను ఎంత అవసరమైనదో తెలుసుకొనుట అవసరము.

2) కలసివుంటే సంఘము క్షేమాభివృద్ధిని సాధించును విడిపోతే సర్వనాశనము, ఆత్మీయ నాశనము కలుగును.

3) క్రీస్తులో ఏకమై వుండుటవలన మనలో మనము ఐక్యతగా కలిసివుంటాము.

***